స్వాతంత్ర్యయోధులందరికీ ప్రభుత్వం వివిధ సదుపాయాలు, వసతులు ఏర్పరచింది.

రామనాథం స్వాతంత్ర్య పోరాటంలో పడిన కష్టాలకు ప్రతిఫలంగా ఐదెకరాల మాగాణి, నెలకు ఐదొందల పెన్షను, పిల్లల చదువులకు స్కాలర్‌షిప్ లభించాయి. తన సంతానం పెద్ద చదువులు చదివి మంచి ఉద్యోగాలు చేస్తున్నారు.

స్వాతంత్ర్య యోధుడుగా, గొప్ప దేశ భక్తుడుగా సమాజంలో మంచి గౌరవాభిమానాలు చూరగొన్నాడు రామనాథం.

ఇంతలో ప్రభుత్వం తామ్రపత్రం బహూకరించి భారత పర్యటన నిమిత్తం ఒక పాస్ మంజూరు చేసింది. మనకు స్వతంత్రం వచ్చి నలభై సంవత్సరాలు దాటింది. స్వాతంత్ర్యయోధులన్న తర్వాత వారి వయస్సు డెబ్బైకి పైబడి వుంటుంది. కనుక ప్రభుత్వం మంజూరు చేసిన పాస్‌లో బాడీ గార్డులాగ ఒక వ్యక్తిని కూడా తోడు తీసుకొని ఆరు నెలలు దేశమంతా ఎక్కడైనా తిరగవచ్చునన్న అవకాశం కల్పించింది. రామనాథం కష్టాలు ఇక్కడే మొదలయ్యాయి.

పాస్ అందుకున్న రామనాథం దేవేంద్ర పదవి పొందినంత ఆనంద మనుభవించాడు. సముద్రం పొంగినప్పుడు చిన్న చిన్న పిల్ల కాలువలు, ఉప్పుటేరులు కూడా సముద్రమయమైనట్టుగానే, ఆనాడు స్వాతంత్ర్య పోరాటంలో తాను కూడా ఏదో నిమాత్మ చైతన్యం, ఉద్రేకం పొంది ముందుకురికాడు. ఎన్నోసార్లు జైలు కెళ్లాడు. శరీరమంతా తెల్లవారి లాఠీ దెబ్బలకు నల్లని కాయలు కాచింది. ఎన్నిసార్లు పోలీసులు ఆయనను రోడ్లపై ఈడ్చుకెళ్లారో లెక్కలేదు. భార్య జానకమ్మ "వీర గంధము తెచ్చినారము, వీరులెవ్వరో తెలుపుడీ!" అని వీధుల వెంట తిరిగి సాగివచ్చిన మగధీరులకు వీర గంధం అందించి ధన్యతనొందింది. చివరకు ఆమె కూడా దేశం కోసమే జైలుకెళ్ళి అక్కడ ఆరోగ్యం దెబ్బతిని అశువులు బాసింది.

రామనాథం కను కొలకుల్లో నీళ్ళు తిరిగాయి. ఇలాగ ఎందరి కుటుంబాలు ఆనాడు అస్తవ్యస్తమయ్యాయో ననుకున్నాడు.

ఇద్దరు కొడుకులు తన వద్ద వుండమంటే తన వద్ద వుండమని బ్రతిమిలాడి బలవంతం చేశారు రామనాథాన్ని.

"నగర జీవితం యాంత్రికమైంది. అక్కడ తరచుగా మీరే కొన్ని ఇబ్బందులకు లోనుకావలసి వస్తుంది. ఇకపైగా నేనుంటే మీకు ఇబ్బంది కూడా! నా కాళ్ళు, చేతులు ఆడినంత కాలం ఇక్కడే పడుంటాను. అంతగా కదలలేనినాడు మీకు ఎలాగూ తప్పదు కదా! ప్రస్తుతం ఈ గ్రామీణ వాతావరణంలోనే నాకు హాయిగా వుంది!" అని సర్ది చెప్పాడు.

రామనాథం చాలాసార్లు దేశంలోగల అనేక ముఖ్య ప్రదేశాలు వివిధ యాత్రల ద్వారా పర్యటించాడు. ఎలాగూ పాస్ వచ్చింది కనుక కుమారుల్లో ఎవరైనా వస్తే వారితో కలిసి ఎక్కడికైనా అలా వెళ్ళి కొంత దూరం తిరిగి రావచ్చునని వారికి ఉత్తరం రాశాడు. తండ్రితో పాటు వెళ్లటానికి వారికి కోరిక వున్నప్పటికీ ఉద్యోగ రీత్యా సమయం కుదరనందున కొన్నాళ్ళ తర్వాత వెళ్ళి వద్దాం అని ఇద్దరు కొడుకులు సమాధానం ఇచ్చారు.

# పాస్... పాస్!



— కెప్టెన్ షేక్ మౌలాలి

పది రోజులు గడిచాయి. రామనాథం సంధ్యా వందనం కానిచ్చి పడక కుర్చీలో మేను వాల్చి 'ది వార్ ఆఫ్ ఇండిపెండెన్స్' చదువుతున్నాడు.

"నమస్కారం మామయ్య గారూ!" అన్న పలకరింపుతో పుస్తకం మూసి 'ఎవరా?' అన్నట్లు చూశాడు.

"నేనేనండి! రమణను. మీ పెద్దబ్బాయి వేణుగారి బావమరిది కృష్ణారావు కుమారుడ్ని. మా నాన్నగారు మీతో చిన్న రిక్వెస్ట్ చెయ్యమన్నారు. నాకు శ్రీనగర్‌లో ఎం.ఎ. పాలిటిక్స్ సీటు వచ్చింది. నాన్నగారికి పొలం పనులు గట్టా ఎక్కువగా వున్నాయట! ఇటీవల మీకు ప్రభుత్వం ఫస్ట్ క్లాస్ రైల్వే పాస్ ఇచ్చిందటగా! మరో విధంగా భావించకపోతే కాస్త అక్కడదాకా వచ్చి నన్ను ఎం.ఎ.లో చేర్పించండి. ఛార్జీ ఖర్చులు నాలుగు వందలు మిగులుతాయి. మా నాన్నగారు మిమ్మల్ని ఈ సహాయం చేయమని మరీమరీ చెప్పారు!" అన్నాడతను.

శ్రీనగర్ వెళ్ళి అతనిని యూనివర్సిటీలో చేర్పించి అక్కడ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిద్దామనుకున్న రామనాథం కోరిక కాస్తా నీరు కారిపోయింది. కర్ఫ్యూ, బంద్‌ల మధ్య అక్కడకు వెళ్ళి తిరుగుబండిలో ఇల్లు చేరి, తిరిగి మనిషి కావటానికి వారం రోజులు పట్టింది.

మరో వారం గడిచింది. ప్రక్క వీధి నుండి సుబ్బయ్య అనే వ్యక్తి వచ్చి తన మేనల్లుడు ఒక ఉద్యోగానికి అప్లయి చేస్తున్నాడని, అందుకు లోకల్ ఎం.పి. సిఫారసు ఉత్తరం కావాలని, అతను ప్రస్తుతం ఢిల్లీలో వున్నాడు కనుక రామనాథం కూడా తోడుగా వస్తే ఢిల్లీ వెళ్ళి ఉత్తరం తెచ్చుకోవచ్చుననీ, ఈ సహాయం తప్పకుండాచేయాలనీ, చిన్నవాడే తల్లిపోతే ఆ మేనల్లుడిని తానే పెంచానని మొఖమాట పెట్టి ఏకరువు పెట్టాడు. ఫలితంగా రామనాథం తప్పనిసరిగా బయలుదేరవలసి వచ్చింది

మరి కొన్నాళ్ళకు ఎదురింటి కామాక్షమ్మ వచ్చి "బాబాయిగారూ, మరోలా భావించకపోతే కాస్త సహాయం చేస్తారా! మా అమ్మాయి దాక్షాయణికి తొమ్మిదో నెల వచ్చింది. కాస్త మీరు వెళ్ళి అమ్మాయిని తీసుకువస్తే పురుడు పోస్తాను. దాక్షాయణి మీ చేతుల్లో పెరిగిన బిడ్డ కూడాను. మరీ విజయనగరం ఇక్కడకు ఒకరోజు ప్రయాణం. రైళ్ళలో రిజర్వేషన్లు కూడా సరిగా అందవు. మీకేదో స్పెషల్ కోటా వుంటుందటగా! పైపెచ్చు ఫస్ట్ క్లాసు కదా! అమ్మాయి ఏఇబ్బందీ పడకుండా సుఖంగా ఇల్లు చేరుతుంది. రేపే మంచి రోజట! వెళ్ళి ఒకరోజు అక్కడ విశ్రాంతి తీసుకొని సోమవారం తీసుకురండి! ఈలోపు మా వారు విజయనగరం ఫోను చేసి మాట్లాడతారూ!" అంటూ అదేదో రామనాథం కర్తవ్యమన్నట్టు బోధించింది. కాదనలేక వెళ్ళి ఆ అమ్మాయిని తీసుకువచ్చి ఆవిడకు అప్పజెప్పాడు రామనాథం.

రామనాథం మంచితనం, పాస్ ఉదంతం ఆ పరగణా అంతా పాకి ఉద్యోగాల ఇంటర్వ్యూలకు, వ్యాపారపు లావాదేవీలకు, పెళ్ళి చూపులకు, చివరకు చావు చూపులకు కూడా ఆయన్ను వేధించసాగారు. నాలుగు నెలలు ఏమాత్రం విరామం లేకుండా నానా ఊళ్ళు తిరిగి, నానా తిండి, నీరు సేవించిన ఫలితంగా రామనాథం జబ్బునపడి మంచం పట్టాడు. విషయం తెలిసిన కుమారులు వచ్చి తీసుకువెళ్ళి మంచి హాస్పిటల్‌లో చేర్పించారు.

"శక్తికి మించిన ప్రయాణాలు చేసి విరామం లేకుండా పనిచేసిన ఫలితంగా మీ నాన్నగారికి రక్తం పలుచనయింది. నాలుగు నెలలపాటు ఎక్కడికి కదలకుండా పూర్తి విశ్రాంతి తీసుకోవాలి! ఎలాంటి ప్రయాణాలు చేయకూడదు!" అని చెబుతున్న డాక్టర్ మాటలు విని రామనాథం పెద్ద కుమారుడు వేణుని పిల్చి పాస్ చేతిలో పెట్టి ప్రభుత్వానికి సరెండర్ చేయమని చెప్పి నిట్టూర్చాడు. ◆